


19 వ వసంతంలోకి ...
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ కృష్ణా
సోమవారం 9 ఫిబ్రవరి 2026


# ఏకతాటిపైకి గుమ్మడిదుర్రు గ్రామస్తులు

■ స్మశాన వాటిక కేటాయించాలని డిమాండ్ ■ నేడు కలెక్టర్ లక్ష్మీశాను కలవనున్న గ్రామస్తులు




(నక్కా వెంకట్ ఎన్టీఆర్ జిల్లా బ్యూరో చీఫ్ మేజర్ న్యూస్)

పెనుగంచిప్రోలు మండలంలోని గుమ్మడిదుర్రు గ్రామస్తులు ఏకతాటిపైకి వచ్చారు. ఎన్నో ఏళ్ళుగా గ్రామానికి స్మశాన వాటిక కేటాయించాలని ప్రజా ప్రతినిధులు, అధికారుల చుట్టూ కాళ్ళరిగిపోయేలా తిరిగి విసిగి వేజారిన గ్రామస్తులు ఇకపై తాడోపేడో తేల్చుకోవాలని నిర్ణయించుకున్నారని సమాచారం. ఇవాళ గ్రామంలో సమావేశమైన ఎస్సీ కులస్తులు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశాను కలిస్తేనే సమస్య పరిష్కారం అవుతుందని భావించారట. ఈ నేపథ్యంలోనే విజయవాడలో కలెక్టర్ ను కలిసి స్మశాన వాటిక కేటాయించేలా ఆదేశాలివ్వాలని కోరనున్నట్లు సమాచారం.. ప్రధానంగా గుమ్మడిదుర్రు గ్రామంలో ఎస్సీలే అత్యధికంగా జనాభా ఉంటారు. ఎన్నో ఏళ్ళుగా స్మశాన వాటిక లేకపోవడంతో వాళ్ళే చందాలు వేసుకొని కొద్దిపాటి స్థలాన్ని కొనుగోలు చేసుకున్నారు. ప్రస్తుతం అది నిండిపోవడంతో ఖననానికి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇదే విషయంపై ప్రతి ప్రజాప్రతినిధికి మొర పెట్టుకుంటున్నా అదిగో చేస్తాం ఇదిగో చేస్తామంటూ ఎన్నికల ముందు ఓట్లేపించుకొని ఎన్నికల తర్వాత మొహం చాటేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. దీంతో గుమ్మడిదుర్రు గ్రామస్తులు స్మశాన వాటిక కోసం ఏకతాటిపైకి రావాలని నిర్ణయించుకున్నారు. అదేవిధంగా గ్రామంలో అటు రెవెన్యూ, పోరంబోకు స్థలాలు ఉన్నా తమకు కేటాయించడానికి అభ్యంతరం ఏంటో అర్థం కావడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించాలని కోరుతున్నారు. నేడు కలెక్టర్ ను కలిసి ఫిర్యాదు చేసి తమ గ్రామానికి స్మశాన వాటిక మంజూరు చేయాలని కోరనున్నారు. అలాగే స్థానికంగా ఉన్న అధికారులపై ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.




కేశినేని ఫౌండేషన్ ఎన్ఐఆర్డి ఆధ్వర్యంలో..

## నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ

**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 8, మేజర్ న్యూస్ :** సీఎం ఆలోచనల కు అనుగుణంగా ఎస్.హెచ్.జి మహిళల స్వయం ఉపాధికి ఎంపీ కేశినేని శివనాథ్ తోడ్పాటుతో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతాయ్య) సహకారంతో హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి లో మహిళలకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ కార్యక్రమానికి ప్రత్యేక బస్సులో 40 మంది మహిళలను ఎస్.హెచ్.జి పంపడం జరిగింది. జెండా ఊపి బస్సును ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్ఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ కేశినేని ఫౌండేషన్ ఎన్.ఐ.ఆర్.డి సంయుక్త ఆధ్వర్యంలో హ్యాండ్‌మేడ్ పేపర్ ప్రొడక్ట్స్ తయారీ పై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. పిబ్రవరి 9వ తేదీ నుంచి 13 వరకు హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి ప్రధాన కార్యాలయంలో మిగతా 2లో...

# కృష్ణమ్మ ఒడిలో కవితా నీరాజనం..

## కవులే సమాజానికి మార్గదర్శకులు

బోధిసిరి నౌకలో 51 మంది కవుల కవితా గానం

స్వయంగా వీక్షించిన మంత్రి దుర్గేష్

రాష్ట్రవ్యాప్త నదీ తీరాల్లో ఇలాంటి సాహిత్య కార్యక్రమాల నిర్వహణకు శ్రీకారం చూడతామని హామీ



**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్**

ప్రకృతి ఒడిలో సాగే సాహిత్య సమ్మేళనాలు సమాజానికి కొత్త దిశానిర్దేశం చేస్తాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఆదివారం విజయవాడ భవానిపురం సమీపంలోని హరిత బెర్మ్ పార్కు వద్ద ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం, ఏపీ పర్యాటక శాఖ, మల్లెతీగ సాహిత్య సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన "కృష్ణా తీరం కవితా హారం" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశతో కలిసి 'బోధిసిరి' నౌకలో ప్రయాణిస్తూ, 51 మంది కవులు వినిపించిన కవితలను ఆసక్తిగా ఆలకించారు. కృష్ణమ్మ అలల పైన కదులుతున్న పడవలో కవి సమ్మేళనం జరగడం ఒక కొత్త ఒరవడికి నాంది అని మంత్రి దుర్గేష్ అభివర్ణించారు. అమరావతి ఒడిలో ప్రవహించే కృష్ణమ్మకు ఈ తరం కవులు సమర్పించిన కవితా హారతి ఇది అని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ పలు కీలక అంశాలను వెల్లడించారు. త్వరలోనే నంది నాటకోత్సవాలు నిర్వహించి, నంది అవార్డులను అందజేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో కుంటుపడిన సాంస్కృతిక రంగాన్ని గాడిలో పెడు తున్నామని, ఉగాది పురస్కారాలు, కందుకూరి పురస్కారాలను ఘనంగా 2

# కృష్ణమ్మ ఒడిలో కవితా నీరాజనం..







(మొదటిపేజీ తరువాయి)

అందజేస్తామన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో మహాకవి తిక్కన విగ్రహ ఏర్పాటుపై ఇప్పటికే సీఎం చంద్రబాబు నాయుడుతో చర్చించామని, త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఇదే తరహాలో పెన్నా, గోదావరి నదీ తీరాల్లో సాహిత్య కార్యక్రమాలు చేపడతామని, ముఖ్యంగా దేవీపట్నం నుండి పాపికొండలు వెళ్లే లాంచీలో త్వరలోనే కవి సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. సమకాలీన సమాజంలోని అట్టడుగు వర్గాల ఆవేదనను ప్రతిబింబించేలా సాగిన ఈ కవితలను వీడియో డాక్యుమెంటేషన్ ద్వారా డిజిటలైజ్ చేసి భావితరాలకు అందించనున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. కవులు, కళాకారుల ఆత్మగౌరవాన్ని కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ విమర్శల మధ్య ఇలాంటి సాహిత్య వేదికలు తమకు మానసిక శాంతిని, సమాజ సేవకు పునరంకితమయ్యే స్ఫూర్తిని ఇస్తాయని మంత్రి దుర్గేష్ చమత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ముంబై నుంచి వచ్చిన 51 మంది కవులను మంత్రి దుర్గేష్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా యంత్రాంగం, మల్లెతీగ సంస్థ ప్రతినిధులు, సాహిత్య అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**కవులు.. లోకానికి భావభానులు: కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

కవులు సమాజానికి వెలుగునిచ్చే భావభానులని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. రచయితలు, వారి రచనలను పరిరక్షించుకోవడం సమాజ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. కళలు, సాహిత్యం మన సంస్కృతికి జీవన రేఖలని.. చెట్టు వేర్లు వంటివని.. ఇవి ఎంత బలంగా ఉంటే మన సమాజం అంత బలంగా ఉంటుందని పేర్కొన్నారు. సృజనాత్మకతకు ప్రోత్సాహం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు. స్థానిక పర్యాటకాన్ని, సంస్కృతిని, కళలు, సంప్రదాయాలను ఎప్పుడూ కాపాడుకోవాలని ముఖ్యమంత్రి చెబుతుంటారని పేర్కొన్నారు. రచయితలు తమ రచనల ద్వారా సమాజాన్ని చైతన్యవంతం చేస్తారని, భావజాల వికాసంలో వారి పాత్ర అనిర్వచనీయమన్నారు. కవులు, రచయితలు, రచనలు లేని సమాజాన్ని ఊహించుకోలేమని.. తెలుగు సాహిత్యాన్ని మరింతగా ప్రోత్సహించే వారందరికీ ప్రభుత్వం చేయూతగా నిలుస్తుందని.. జాతీయ సాంస్కృతిక ఉత్సవాల స్ఫూర్తితో నేడు నిర్వహించిన కృష్ణాతీరం-కవితా హారం కార్యక్రమాన్ని ఇంత గొప్పగా నిర్వహించిన మల్లెతీగ సాహిత్య సేవా సంస్థకు అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

ఏపీ సృజనాత్మక, సంస్కృతి సమితి ఛైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి మాట్లాడుతూ ఒక జాతి బతకాలంటే భాష బతకాలి, సమాజం బతకాలంటే సాహిత్యం బతకాలి.. చరిత్ర అనేది రాజుల శాసనాల నుంచి కాదు.. కవుల పద్యాల నుంచి తెలుసుకున్న చరిత్రమనదని పేర్కొన్నారు. నది భూమిని సస్యశ్యామలం చేస్తుంటే, కవులు మనుషుల మనసులను సస్యశ్యామలం చేస్తారని పేర్కొన్నారు. వేమన పద్యాలు, సుమతీ శతకం అందించే జ్ఞానం ప్రపంచమంతా తిరిగినా దొరకదని, సాహిత్యం అనేది తరతరాలకు విజ్ఞాన వారధి అని పేర్కొన్నారు. మనం ఎంత ఆధునికమైన ఏఐ యుగంలో జీవిస్తున్నప్పటికీ మూలాలను మరచిపోకూడదని, భాషసాహిత్యాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తేజస్వి స్పష్టం చేశారు.

కవులు, కళాకారులను రక్షించుకోవడం ద్వారా మాత్రమే సంస్కృతి నిలుస్తుందని.. ఈ విషయంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ అహర్నిశలు కృషిచేస్తోందని, ఇలాంటి గొప్ప కార్యక్రమాలకు ఎప్పుడూ తమ సహకారం ఉంటుందని తేజస్వి పేర్కొన్నారు. సంప్రదాయాలు, విలువలు, కళలను జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ప్రోత్సహిస్తున్న తీరు, ఆయన కళాత్మక హృదయం.. జీవనదీ ప్రవాహమని అన్నారు. కొండపల్లి బొమ్మలు, కళాకారుల సంక్షేమానికి కృషిచేస్తున్న తీరు ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. కళలు, కళాకారులను ప్రతిఒక్కరూ గౌరవించుకోవాల్సిన అవసరముందని.. ఈ విషయంలో ప్రభుత్వం ముందుంటోందని ఆమె పేర్కొన్నారు. మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ అధ్యక్షులు కలిమిశ్రీ మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని మరింతగా ప్రోత్సహించేందుకు, ముఖ్యంగా సరికొత్తగా రూపాంతరం చెందిన, చెందుతున్న నేటితరం కవిత్వాన్ని కాలగర్భంలో కలిసి పోకుండా భద్రపరిచి, ముందుతరాలకు అందించేందుకు రికార్డు చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి నట్లు తెలిపారు. ఇంత గొప్ప కార్యక్రమానికి చేయూతనిచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లా యంత్రాంగానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, యేమినేని వెంకటరమణ, చొప్పా రాఘవేంద్రశేఖర్, కె.సంపత్, వై.డి.ఆనంద్, పి.చిదంబరం, బత్తిన అగస్తీశ్వరరావు, విష్ణభొట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వెంకట సుబ్బయ్యను పరామర్శించిన ఎమ్మెల్యే



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జడ్పిటిసి సభ్యులు మోటూరు వెంకట సుబ్బయ్య ను మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో ఆయన స్వగృహానికి వెళ్లి పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వెంకటసుబ్బయ్యను ఆదివారం కుమార్ రాజా స్వయంగా వెళ్లి పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కుమార్ రాజా తో పాటు కృష్ణాపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నాదెళ్ళ సుబ్రహ్మణ్యం, పలువురు స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఈ నెల 9వ తేదీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుండి మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక- కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చున్నారు. మీకోసం --ప్రజా సమస్యల పరిష్కార వేదిక కాల్ సెంటర్ నంబర్ 1100 కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతోపాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చున్నారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్ సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా కలెక్టర్ కోరారు.

# కేశినేని పౌండేషన్ ఎన్ఐఆర్డి ఆధ్వర్యంలో.. నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ

(మొదటిపేజీ తరువాయి)

ఐదు రోజుల శిక్షణ జరుగుతుంది. ఎంపీ కేశినేని శివనాథ్ సారథ్యంలో ఎస్.హెచ్.జి మహిళలకు 11వ నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. జగ్గయ్యపేట నియోజకవర్గశీ మొత్తం ఇంటికో పారిశ్రామిక వేత్త వుండాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాన్ని ముందు తీసుకువెళ్లుందుకు ఎంపి కేశినేని శివనాథ్ ఆయన ఫౌండేషన్ ద్వారా తన సొంత నిధులతో ప్రణాళిక బద్దంగా అడుగులు వేయటంతో పాటు మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు తోడ్పాటు అందిస్తున్నారని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతాయ్య) అన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ సారథ్యంలో కేశినేని ఫౌండేషన్, ఎన్.ఐ.ఆర్.డి సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి ప్రధాన కార్యాలయంలో ఈ నెల 9 నుండి 13వ తేదీ వరకు ఐదు రోజుల పాటు హ్యాండ్‌మేడ్ పేపర్ ప్రొడక్ట్స్ తయారీ విధానంపై శిక్షణ పొందేందుకు ఎన్టీఆర్ జిల్లా రూరల్ నియోజకవర్గాలకు చెందిన 40 మంది ఎస్.హెచ్.జి మహిళలతో ఒక ప్రత్యేక బస్సు ఆదివారం జగ్గయ్యపేట పట్టణం మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి బయలుదేరింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ శిక్షణ పొందేందుకు వెళుతున్న మహిళలకు శుభాకాంక్షలు తెలపటంతో పాటు వారితో స్వయం మాట్లాడి వారి ఆసక్తి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతాయ్య) జెండా ఊపి బస్సు ప్రారంభించారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు ఎంతో దోహదపడతాయని, హ్యాండ్ మేడ్ పేపర్ ప్రొడక్ట్స్ వంటి ఉపాధి అవకాశాలు గ్రామీణ మహిళలకు స్థిరమైన ఆదాయ మార్గంగా మారుతాయన్నారు. కేశినేని ఫౌండేషన్ సహకారంతో మహిళలకు శిక్షణ, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తుండటం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వం మహిళల సంక్షేమం, ఉపాధి కల్పనకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. గ్రామాలతో పాటు గ్రామాల్లోని మహిళల అభివృద్ధి కోసం ఎన్.ఐ.ఆర్.డి తో కేశినేని ఫౌండేషన్ ఎమ్.వో.యు చేసుకోవటం చాలా గొప్ప విషయమంటూ ప్రశంసించారు. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల స్వయం సహాయక సంఘాల మహిళలను స్వయం ఉపాధి మార్గం వైపు నడిపించేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరంఎన్.ఐ.ఆర్.డి రూరల్ కో-ఆర్డినేటర్ సొంగా సంజయ్ వర్మ మాట్లాడుతూ ఎంపీ కేశినేని శివనాథ్ నేతృత్వంలో గత ఏడాది నుంచి ఎస్.హెచ్.జి మహిళలకు ఎన్.ఐ.ఆర్.డిలో స్వయం ఉపాధి కి సంబంధించి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇప్పిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు 10 నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు జరగ్గా అందులో తొమ్మిది శిక్షణా కార్యక్రమాల్లో జగ్గయ్యపేట ఎస్.హెచ్.జి మహిళలు పాల్గొన్నారని, వారంతా ఇప్పుడు స్వయంగా ప్రొడక్ట్స్ తయారు చేసి ఎంటర్ ప్రెన్యూర్స్ రాణిస్తున్నారని తెలిపారు. వీరు తయారు చేసే ప్రోడక్ట్స్ కూడా మార్కెటింగ్ చేసేందుకు కూడా ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతాయ్య) కృషి చేస్తున్నారని తెలిపారు. అలాగే తిరువూరు, నందిగామ, మైలవరం నియోజకవర్గాల్లోని



ఎస్.హెచ్.జి మహిళలకు ఎన్.ఐ.ఆర్.డి నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలు ఇప్పించటం జరిగిందని...ఎంపీ కేశినేని శివనాథ్ సారధ్యంలో ఇది నిరంతరం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఎన్.ఐ.ఆర్.డి అర్బన్ కో-ఆర్డినేటర్ వల్లభనేని నరసింహాచౌదరి, జిల్లా సమైక్య అధ్యక్షురాలు కల్పన, జగ్గయ్యపేట మండల డెవలప్మెంట్ అధికారి జి.నితిన్, టిడిపి టౌన్ పార్టీ ప్రధాన కార్యదర్శి మైనేని రాధ, కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మీ, సూర్యదేవర రామ్ ప్రసాద్, నెక్కరికంటి వెంకటి, టిడిపి నాయకుడు ఎస్.కె.నజీమున్, మండల మహిళ సమైక్య అధ్యక్షురాలు నాయిని రజనీ, కృష్ణవేణి, వెలుగు ఎ.పి.ఎమ్ లు లక్ష్మణారావు, సంఘయ్యలతో పాటు ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడిలోనే పిల్లలను చేర్పిద్దాం...




జి కొండూరు మేజర్ న్యూస్ : జి కొండూరులో ఆదివారం సోల రాఘవ రాజు మీడియాతో మాట్లాడుతూ ఊరి బడిని కాపాడుకుంటేనే పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్య అందుతుందని, లేకపోతే పేదలకు విద్య దూరమయ్యే ప్రమాదం ఉందని పి ఆర్ టి యు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోలా రాఘవ రాజు పేర్కొన్నారు. "ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం-ఊరి బడిని కాపాడుకుందాం" అని నినాదంతో ముందుకు వెళ్లాలి. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతూ, విద్యార్థులను అత్యుత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ప్రభుత్వ బడులేనన్నారు. ప్రభుత్వ బడులు కేవలం విద్యనే కాకుండా సంస్కారాన్ని, జ్ఞానాన్ని, నైతిక విలువలను అందిస్తాయన్నారు. ప్రస్తుతం పోటీ ప్రపంచంలో రాణించాలంటే ప్రభుత్వ బడులు అందించే విద్య, మానసిక స్థైర్యం, మానవతా విలువలు ద్వారా మాత్రమే సాధ్యమన్నారు. ప్రభుత్వ బడుల్లో కాకుండా, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యనభ్యసించిన విద్యార్థులు కనీస ఒత్తిడులను సైతం ఎదుర్కోలేక జీవితంలో విఫలమవుతున్నారన్నారు. ఒత్తిడులను అధిగమించలేక కుటుంబ బాంధవ్యాలకు, మానవ సంబంధాలకు దూరంగా ఉండేందుకు ఇష్టపడుతున్నారన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు విద్యనందించే ప్రభుత్వ బడులు పాలకులకు భారంగా మారాయని, ప్రభుత్వ బడుల నిర్వహణ బాధ్యతల నుండి క్రమేపి తప్పుకునేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారని, దీంతోపాటు కార్పొరేట్ మాయాజాలంలో పడి కార్పొరేట్ విద్యపై విద్యార్థుల తల్లిదండ్రులు మోజు పెంచుకోవడం వల్ల కార్పొరేట్ విద్యపై ఆసక్తి చూపుతున్నారన్నారు. కార్పొరేట్ విద్యపై తల్లిదండ్రుల మోజును సొమ్ముగా మార్చుకునేందుకు పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థల యాజమాన్యాలు కళ్ళ ముందు కలల ప్రపంచాన్ని సృష్టిస్తున్నారన్నారు. ఈ మాయ ప్రపంచాన్ని గుర్తించి ప్రజలు అప్రమత్తం కాకపోతే ప్రభుత్వ విద్య పూర్తిగా దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఊరి బడిలో ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన జరుగుతుందని, నిరంతర పర్యవేక్షణతో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు అన్ని రకాల పోటీ పరీక్షల్లో నెగ్గిన ఉపాధ్యాయులు పోటీపడి విద్యను అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ బడులలో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల విద్యాసామాగ్రిని ఉచితంగా అందజేయడంతో పాటు, నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజన సదుపాయం, ఆధునిక పరిజ్ఞానంతో కూడిన ఐ.ఎఫ్.బి ప్యానెల్ బోర్డులు, ఎల్ఈడి టీవీల సహాయంతో విద్యాబోధన సాగుతున్నదన్నారు. ట్రిబుల్ ఐటి లాంటి ప్రతిష్ఠాత్మకమైన విద్యను పొందాలన్నా విద్యార్థి ప్రభుత్వ బడిలోనే చదవాలన్నారు. ఊరి బడిని కాపాడుకొనేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచించి ప్రభుత్వ బడులలోనే విద్యార్థులను చేర్పించాలన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకునేందుకు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. విద్యావేత్తలు, మేధావులు, విద్యార్థి, యువజన సంఘాలు సైతం ఊరి బడిని కాపాడుకునేందుకు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.

# సీసీ కెమెరాల సహాయంతో పోయిన బంగారు బ్రాస్లెట్ కనిపెట్టి బాధితురాలికి అందజేత



మచిలీపట్నం మేజర్ న్యూస్ : బాధితురాలు పోగొట్టుకున్న బంగారు బ్రాస్లెట్ ను అత్యంత తక్కువ సమయంలోనే మచిలీపట్నం డిఎస్పి క్రైమ్ పార్టీ సిబ్బంది సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించి ఆ వస్తువు స్వాధీనం చేసుకుని చిలకలపూడి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ అబ్దుల్ నబి గారి చేతుల మీదుగా ఆమెకు అందజేయడం జరిగింది. నర్సాపురానికి చెందిన ఆకుల లిఖిత అనే మహిళలు తన యొక్క మొక్కుబడి తీర్చుకునేందుకు నరసాపురం నుండి విజయవాడ బయలుదేరింది.ఆ క్రమంలో మచిలీపట్నం బస్టాండ్ లో దిగి విజయవాడ బస్ కోసం ఎదురుచూస్తున్న సమయంలో తన చేతికి ఉన్న బ్రాస్లెట్ జారి పడిపోయింది. అది గమనించిన బాధితురాలు వెంటనే పోలీస్ వారికి ఫిర్యాదు చేయగా ఫిర్యాదు అందిన వెంటనే కేసును సీరియస్‌గా తీసుకుని, పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి నిందితుడిని గుర్తించి, పోయిన బంగారు బ్రాస్లెట్లను రికవరీ చేయడం జరిగింది. సుమారు 70 వేల రూపాయలు విలువగల పోయిందనుకున్న బంగారం తిరిగి లభించడంతో బాధితురాలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తూ, పోలీసు సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజల భద్రతే లక్ష్యంగా, నేరాల నియంత్రణలో భాగంగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, వేగవంతమైన దర్యాప్తుతో న్యాయం అందించడంలో కృష్ణాజిల్లా పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా తెలియజేశారు.

## జాతీయ స్థాయిలో మెరిసిన శ్రీనివాస డిజిటల్ స్టూడియో

### ఫోటోగ్రఫీ రంగంలో మరో మైలురాయి సాధించిన గంటా శ్రీనివాస్

హనుమాన్ జంక్షన్, ఫిబ్రవరి 8, మేజర్ న్యూస్ : హైదరాబాద్‌లో శనివారం ఘనంగా నిర్వహించిన ఇండియన్ వెడ్డింగ్ ఫోటోగ్రఫీ ఫెస్టివల్ కార్యక్రమంలో భాగంగా జరిగిన ఫోటో ఫినా2026 అవార్డ్స్ ప్రదానోత్సవంలో హనుమాన్ జంక్షన్‌కు చెందిన శ్రీనివాస డిజిటల్ స్టూడియో అధినేత గంటా శ్రీనివాస్ కు ప్రతిష్టాత్మకమైన "వెడ్డింగ్ ఫోటోగ్రఫీ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు" లభించింది. వెడ్డింగ్ ఫోటోగ్రఫీ రంగంలో సృజనాత్మకత, నాణ్యతా ప్రమాణాలు, వినూత్న ఆలోచనలు, వినియోగదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకున్నందుకు ఈ అవార్డును ఆయనకు ప్రదానం చేశారు. గతంలో కూడా పలు రాష్ట్ర, జాతీయ స్థాయి పురస్కారాలను అందుకున్న గంటా శ్రీనివాస్, ఈ తాజా అవార్డుతో తన ప్రతిభను మరోసారి చాటుకున్నారు. ఈ అవార్డును జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ ప్రొఫెసర్ కమల్ రాయ్, తెలంగాణ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పోసిన వీరేంద్ర కుమార్, కార్యదర్శి మద్దాల శేఖర్ చేతుల మీదుగా అందజేశారు. అలాగే ప్రముఖ సినీ కమెడియన్, మాజీ మంత్రి బాబు మోహన్ ప్రత్యేకంగా గంటా శ్రీనివాస్‌ను అభినందిస్తూ, ఫోటోగ్రఫీ రంగంలో మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా హనుమాన్ జంక్షన్ ఫోటో & వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చక్రపాణి విజయ్ కుమార్, కార్యదర్శి తాడి రంగారావుతో పాటు సభ్యులు శ్రీనివాస్‌ను ఘనంగా అభినందించారు. స్థానికంగా చిన్న పట్టణం నుంచి జాతీయ స్థాయికి ఎదిగి అవార్డు అందుకోవడం హనుమాన్ జంక్షన్‌కు గర్వకారణమని పలువురు అభిప్రాయపడ్డారు.





## పోటీతత్వం ఉన్నప్పుడే విద్యార్థులు రాణించగలుగుతారు



పామర్రు మేజర్ న్యూస్ : విద్యార్థులలో పోటీతత్వం నెలకొన్నప్పుడే వారు ఆయా రంగాలలో రాణించగలుగుతారని పామర్రు శాసనసభ్యులు వరల కుమార్ రాజా పేర్కొన్నారు. మండల పరిధిలోని జుజ్జవరం గ్రామంలో గల ఉషోదయ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ రజతోత్సవ (25వ వార్షికోత్సవ)వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ పోటీ తత్వం అలవర్చుకొని అన్ని విషయాలలోనూ పోటీ పడాల్సిన పరిస్థితి ఉందన్నారు. క్రమశిక్షణ, పోటీతత్వం ఉన్నవారు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోగలుగుతారని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ ఎండి రఫీ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలలో అప్సా డెమొక్రటిక్ రాష్ట్ర అధ్యక్షులు గొల్లపూడి మోహనరావు, ప్రగతి విద్యా సంస్థల అధినేత సనకా పూర్ణచంద్రరావు, పామర్రు సిఐ వి.శుభాకర్, ఎస్సై వి.రాజేంద్రప్రసాద్, తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జన్ను శోభన్ బాబు, ఎంపీపీ దాసరి అశోక్ కుమార్, మాజీ ఎంపిపి గొట్టిపాటి లక్ష్మీదాసు, ఎంఇఒ -1, 2 లు ఎ.భాను ప్రకాష్, జి.పద్మావాణి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, నాటికలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అలాగే పాఠశాల చిన్నారులు ఆలపించిన గీతాలు అలరించాయి. చదువు, క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.



## గంగమ్మ కటాక్షం ప్రజలందరి పై ఉండాలి

### గంగానమ్మ గుడికి 1,01,116 వేలు వితరణ చేసిన జంపాల దంపతులు

ఇబ్రహీంపట్నం మేజర్ న్యూస్ : తూర్పు ఇబ్రహీంపట్నంలో నూతనంగా నిర్మించిన గంగానమ్మ గుడిని ఆదివారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్య దర్శి జంపాల సీతారామయ్య దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గుడి కమిటీ సభ్యులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి జంపల దంపతులకు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా జంపాల సీతారామయ్య నూతనంగా నిర్మించిన గుడి అభివృద్ధికి లక్ష వెయ్యి 116 రూపాయలు గుడికి వితరణ గుడి కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చల్లని దయగల గంగమ్మ తల్లి కటాక్షం అందరిపై ఉండాలని, అమ్మవారిని కోరినట్లు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు జంపాల దంపతులను సత్కరించి అమ్మవారి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో గుడి కమిటీ అధ్యక్షులు కోయ బోసు, సెక్రెటరీ మరోతి ప్రసాద్, కొండపల్లి మున్సిపల్ చైర్మన్,టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు, స్థానిక కౌన్సిలర్ చనుమోలు నారాయణరావు, ఇబ్రహీంపట్నం సొసైటీ అధ్యక్షులు నెహ్రూ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## మూలపాడులో ఘనంగా 65వ పాఠశాల వార్షికోత్సవం




ఇబ్రహీంపట్నం మేజర్ న్యూస్ : మూలపాడు లో 65వ పాఠశాల వార్షికోత్సవము లో భాగంగా మన ఎన్ టి ఆర్ జిల్లా విద్యాశాఖాధికారిణి. ఎన్.చంద్రకళ పాల్గొని,పాఠశాలతో ఆమెకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ, ఒక నెలలో పబ్లిక్ పరీక్షలు రాయబోయే పదవ తరగతి విద్యార్థుల మంచి సూచనలు చేసి,600కి590 మార్కులకు పైగా సాధించాలని పిల్లలను ఆశీర్వదిస్తూ,ఆల్ ది బెస్ట్ చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీ డేవిడ్ రాక్ ఫెల్లర్ పాస్ పర్సెంటేజ్ పెంచుతామని డి ఇ ఒ ఎన్ చంద్రకళ మేడం కి హామీ ఇచ్చారు.మన జిల్లా ఉప విద్యాశాఖాధి కారి సాంబశివరావు పాల్గొని పదవ తరగతి విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంకా ప్రజా ప్రతినిధులు,గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.విద్యార్థులు ఆటల పాటలతో, నృత్యాలతో అందరిని అలరింపజేశారు.ఈ సంస్కృతిక కార్య క్రమంలో పాఠశాల విద్యాబృందం అంతా పాల్గొని సభను విజయవంతం చేశారు.పాఠశాల స్టాఫ్ సెక్రటరీస్ వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మి ఈ పాఠశాల 65వ వార్షికోత్సవము లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులు స్థానిక పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా డాక్టర్ వైయస్ఆర్ సేవ సమితి...



విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ : రామవరప్పాడు గ్రామంలో 13వ వార్డ్ లో నివాసముంటున్న టి.ప్రసాద్ కుటుంబానికి డాక్టర్ వైయస్ఆర్ సేవ సమితి ఫౌండర్ వేమలపల్లి.రవి జగన్ ఆధ్వర్యంలో వార్డ్ మెంబర్ మేకల నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు నూకల పుల్లయ్య,ఎంపీటీసీ సభ్యులు బల్లెం సునీత ఎంపీటీసీ సభ్యులు తండ్రోతు సౌజన్య చేతుల మీదుగా నిత్యాస రకులు అందించడం జరిగింది.ఇంకా ఈ కార్యక్రమంలో డాక్టర్ వైయస్ఆర్ సేవ సమితి సభ్యులు ఉప్పులూరి ప్రేమ్, పెనుమాక రాజేష్, మేడిశెట్టి. ఆనంద్ కుమార్,పరసా కిరణ్ కుమార్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సంక్షేమమే నా శ్వాస...








**ఉద్యోగుల ఆకాంక్షలకనుగుణంగా కార్యవర్గం పనితీరు...**

**యువనాయకత్వాన్ని ప్రోత్సాహిస్తున్నాం...**

**చట్టబద్ధ హక్కులను వదులుకోం...**

**కీలక సమస్యల పరిష్కారమే మా ముందున్న లక్ష్యం...**

**మీ నమ్మకాన్ని నిలబెట్టేందుకు నిబద్ధతతో పనిచేస్తాం**

**ఏపీ ఎన్జీజీవో సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్, డివి రమణ**

**విజయవాడ, మేజర్ న్యూస్ :** గత 75 సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చట్టబద్ధంగా లభించాల్సిన హక్కుల సాధనలో ఏపీ ఎన్జీజీవో సంఘం అనుసరిస్తున్న విధానాల వల్లే సంఘం ఇప్పటికీ బలంగా పనిచేస్తోందని ఏపీ ఎన్జీజీవో సంఘం రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్ అన్నారు. మూడు సంవత్సరాల కాల పరిమితితో నిర్వహించే రాష్ట్ర ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఏకగ్రీవంగా జరిగిన ఈ ఎన్నికల్లో విజయం సాధించిన అధ్యక్ష కార్యదర్శులతో సహా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం గాంధీనగర్ లోని జింఖానా గ్రౌండ్స్ లో అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా హాజరైన ఉద్యోగులను ఉద్దేశించి విద్యాసాగర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చట్టబద్ధంగా లభించాల్సిన ప్రతి హక్కును పరిరక్షించేందుకు ఏపీ ఎన్జీజీవో సంఘం కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వ పాలనా కాలంలో పేరుకుపోయిన ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వంతో దశల వారీగా చర్చలు జరిపిన ఫలితంగానే 50 శాతం బకాయిలు ఉద్యోగులు పొందగలిగారని గుర్తు చేశారు. ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సేవల అంశంలో ప్రభుత్వం నియమించిన కమిటీ లో ఉద్యోగ సంఘాలకు కూడా కీలక పాత్ర పోషించే అవకాశం రావడం ఉద్యోగ సంఘాలకు లభించిన గౌరవమన్నారు. అతి త్వరలో ఆరోగ్య సేవల సమస్య సంతృప్తికర స్థాయిలో పరిష్కారమవుతుందన్నారు. తనకంటే ముందు అధ్యక్షులుగా పనిచేసిన వారి పనితీరును ఆదర్శంగా తీసుకుంటున్నామన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ వెనకడుగు వేయకుండా అవసరమైతే పోరాటాలకు కూడా ఎప్పుడూ సిద్ధంగా ఉండే ఏకైక సంఘం మనదేనన్నారు. ఒక సంఘం బలంగా ఉండాలంటే సైన్యాధ్యక్షుడుతో పాటు అనుసరించే సైన్యం కూడా యువశక్తితో ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర కార్యవర్గంలో యువతరాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. ఉద్యోగులకు ఎంతో కీలకమైన 12వ వేతన సవరణ సంఘం ఏర్పాటులో మన సంఘం కీలకపాత్ర పోషించనుందన్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన డివి రమణ మాట్లాడుతూ ఎంతోమంది లబ్ద ప్రతిష్ఠుడైన నాయకులు నిర్వహించిన పదవికి తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న జిల్లా కార్యవర్గాలకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ప్రధాన సమస్యలను గత రెండేళ్లలో ఉద్యోగులు ఆశించిన సంతృప్తికర స్థాయిలో పరిష్కరించామన్నారు. మన రాష్ట్ర అధ్యక్షుని పనితీరును జిల్లా స్థాయి నాయకులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నూతన కార్యవర్గం కూర్పులో కూడా రాష్ట్ర అధ్యక్షులు ఎంతో బాధ్యతతో, దార్శనికతతో ఏర్పాటు చేయటం సంఘం పట్ల ఆయనకు ఉన్న బాధ్యతను తెలియజేస్తుందన్నారు. రాష్ట్రంలోని 27 జిల్లాల నుంచి వేలమంది ఉద్యోగులు హాజరైన ఈ సభా వేదికపై సంఘానికి పూర్వ అధ్యక్షులుగా పనిచేసిన పలువురు నాయకులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

## 9న ప్రజా సమస్యల పరిష్కార వేదిక వినతుల స్వీకరణ



**ఎన్టీఆర్ జిల్లా, ఫిబ్రవరి 8, మేజర్ న్యూస్ :** ఫిబ్రవరి 9వ తేదీ సోమవారం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం... పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్టు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. అదేవిధంగా కలెక్టర్ కార్యాలయ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో రెవెన్యూ క్లినిక్ సేవలు కూడా అందుబాటులో ఉంటాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అదేవిధంగా అర్జీదారులు తమ అర్జీలను వీవవనశీయిఎ.ఖజూ.న్రశీజ.అఅ వెబ్సైట్లో నమోదు చేసుకోవచ్చుని.. నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చున్నారు.

## సామాజిక సేవలకు సింగంశెట్టిని వరించిన నంది అవార్డు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ ఫిబ్రవరి 08 :** గుడ్లవల్లేరు గ్రామంకు చెందిన శ్రీసాయి విద్యానికేతన్ అధినేత సింగంశెట్టి ఆదినారాయణ హైదరాబాద్ రితిక ఫౌండేషన్ నంది అవార్డును ప్రకటించింది. లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా, వ్యక్తిగతంగా, విద్యాపరంగా అందించిన సామాజిక సేవారంగంలో ఉత్తమ సేవలందించే వారికి ప్రతి ఏటా ఆ పౌండేషన్ ఇచ్చే నంది అవార్డును 2026 సంవత్సరంకు గాను గుడివాడ లో జరిగిన అవార్డుల ప్రధానోత్సవ సభలో నంది అవార్డుతో సింగంశెట్టి ని పౌండేషన్ ప్రతినిధులు ఆదివారం సత్కరించారు. డాక్టర్ సిఎల్ వెంకటరావు, ముదినేపల్లి డాక్టర్ ఎ. మనోజ్,అమరావతి బ్రాండ్ అంబాసిడర్ వైష్ణవి, అనేకమంది ప్రజలు పాల్గొన్నారు..

## డోకిపర్రు మహాక్షేత్రంలో గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ విద్యార్థి వరుణ్ తేజకు ప్రథమ బహుమతి

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ ఫిబ్రవరి 08 :** డోకిపర్రు మహాక్షేత్రం, కృష్ణా జిల్లాలో గల శ్రీ భూసమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శారదా దేవి (సరస్వతి) యాగం శుభ సందర్భాన్ని పురస్కరించుకుని నిర్వహించిన అంతర్ పాఠశాల చిత్రలేఖన పోటీలను ఆదివారం నాడు ఘనంగా ముగిసాయి. ఈ పోటీల్లో ఎఎఎన్ఎమ్, వివిఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ విద్యాసంస్థ కు చెందిన ప్రతిభావంతుడైన విద్యార్థి బి.వరుణ్ తేజ తన అసాధారణ కళా నైపుణ్యంతో న్యాయనిర్ణేతల ప్రశంసలు అందుకొని ప్రథమ బహుమతి సాధించడం గర్వకారణంగా నిలిచింది. ప్రథమ బహుమతిగా బంగారు పతకంతో పాటు రూ.18,000/- నగదు బహుమతి, ప్రశంసా పత్రాన్ని దేవస్థాన అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థాన అధికారులు మాట్లాడుతూ"విద్యతో పాటు కళలలోనూ విద్యార్థులు రాణించాలనే ఉద్దేశంతో ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్నాము. వరుణ్ తేజ సాధించిన విజయం ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుంది" అని తెలిపారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎఎఎన్ఎమ్, వివిఆర్ఎస్ఆర్ విద్యాసంస్థ యాజమాన్యాన్ని దేవస్థాన పాలకవర్గం ప్రత్యేకంగా అభినందించింది. ఈ శుభ సందర్భంలో ప్రిన్సిపాల్ ఎన్. రాజశేఖర్ మాట్లాడుతూ అంతర్ పాఠశాల చిత్రలేఖన పోటీల్లో మా విద్యార్థి బి. వరుణ్ తేజ ప్రథమ బహుమతి సాధించడం మా విద్యాసంస్థకు ఎనలేని గర్వకారణం. విద్య అనేది కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా కళలు, సంస్కృతి, సృజనాత్మకతను కూడా పెంపొందించాలి. అలాంటి ఆలోచనతోనే మా విద్యాసంస్థలో విద్యార్థులలోని అంతర్గత ప్రతిభను వెలికితీయడానికి ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తున్నాము. విద్యార్థులు విద్యతో పాటు కళలు, నైతిక విలువలు, సంస్కారాలతో కూడిన సంపూర్ణ వ్యక్తిత్వాన్ని అలవరచుకోవాలని ఈ సందర్భంగా ఆకాంక్షిస్తున్నాము.



ఈ గొప్ప అవకాశం కల్పించిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థాన పాలకవర్గానికి మా విద్యాసంస్థ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాము. ఈ సందర్భంగా బి. వరుణ్ తేజను యాజమాన్య సభ్యులు చైర్మన్ డాక్టర్ నాగేశ్వరావు వల్లూరిపల్లి, సెక్రటరీ & కరస్పాండెంట్ సత్యనారాయణ రావు వల్లూరుపల్లి, కో-సెక్రెటరీ & కరస్పాండెంట్ వల్లూరిపల్లి రామకృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంటార్ ఎన్.ఎస్.ఎస్. వి.రామాంజనేయులు, ప్రిన్సిపాల్ ఎన్..రాజశేఖర్ అభినందించారు..

## రాష్ట్ర ప్రభుత్వం ఆడిటర్‌ల సమస్యలు పరిష్కరించాలి



**విజయవాడ జనవరి 8 మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఆడిటర్ సమస్యల పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఆడిట్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు రవిశంకర్ తెలిపారు గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టేట్ ఆడిట్ శాఖ అందరూ ఉద్యోగులు కలుసు కొని ఒక జే ఏ సి గా ఏర్పాటు చెయ్యడం జరిగింది. స్టేట్ ఆడిట్ ఉద్యోగులు అందరూ ఒక తాటి పైకి వచ్చి శాఖా పరం గా ఉన్న సమస్య లపై పోరాటం చెయ్యాలని పిలుపు ఇవ్వటం జరిగిందనీ ముఖ్యంగా చాలాకాలం గా ఉన్న సీనియర్ ఆడిటర్ నుంచి ఏ ఏ ఓ గా ప్రమోషన్ రావడానికి దాదాపు 20 సంవత్స రాల పడుతోంది ప్రమోషన్ పానెల్ లు సకాలం లో పెట్టక ప్రమోషన్ లు జాప్యం జరిగుతోంది వాటి క్రమబద్ధికరణ కో సం, ఆడిట్ శాఖ లో కంప్యూటర్ లు,ప్రింటర్ లు లేక ఉద్యోగులు చాలా ఇబ్బంది పడుతున్నారు కొత్త జిల్లాలలో పలు కొత్త పోస్టులు కోసం ప్రభుత్వాన్ని కోరమని ఇప్పటికి దాదాపు 10 సంవత్సరాలు క్రితం ఉన్న కాడర్ పోస్టులనే దేవాలయాలలో మునిసిపల్ కార్పొరేషన్ లలో ఆడిట్ సిబ్బంది ని కొనసాగిస్తున్నారు వాటి అప్గ్రేడ్ కోసం ఇటువంటి పలు సమస్య లు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారం చేసే దిశగా వెళ్ళాలని జేఏసీ ఏర్పాటు చేయ డం జరిగిందనీ తెలిపారు. బి.వి.ఎస్.ఎన్ రవిశంకర్. అధ్యక్షులు, వరప్రసాద్, ఉపాధ్యక్షులు, కరిముల్లా హుస్సేన్.కన్వీనర్, ఎం.అబ్రహం.ట్రెజరర్, సతీష్.ఆర్గనైజేషన్ కన్వీనర్, కన్వీనర్లు గా నాగరాజు వెంకటసుబ్బారెడ్డి,ధరణి కుమార్, ప్రదీప్ కుమార్, కిషోర్, నాగేశ్వరావు, హరికృష్ణ, ఎన్నుకోబడ్డారని తెలిపారు.

# బాపులపాడులో ఎస్టీ ప్రజాప్రతినిధిత్వం ఎందుకు దూరం?







**చట్టం స్పష్టం అపోహలు వేరే వాస్తవం చేదు**

**ఆర్టికల్ 243డి ప్రకారం హక్కు ఉన్నా అమలుకాని వాస్తవం**

**అధిక శాతం ఉండాలన్న అపోహల మధ్య నలుగుతున్న రాజ్యాంగ హక్కు**

**రానున్న ఎన్నికలే పరీక్ష**

హనుమాన్ జంక్షన్, ఫిబ్రవరి 8, మేజర్ న్యూస్ : ప్రజాస్వామ్య సౌధంలో అందరికీ సమాన వాటా ఉండాలన్నది రాజ్యాంగ ఆశయం. కానీ, బాపులపాడు మండలం బాపులపాడు గ్రామ పంచాయతీ చరిత్రను తిరగేస్తే ఒక సామాజిక వర్గానికి జరుగుతున్న అన్యాయం స్పష్టమవుతోంది. దశాబ్దాలు గడుస్తున్నా, ఎన్నికలు వస్తున్నా.. షెడ్యూల్డ్ తెగలకు (ఎస్టీ) మాత్రం నాయకత్వ అవకాశం అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది. ఆర్టికల్ 243–డి హామీ ఇస్తున్న రాజకీయ సాధికారత ఈ గ్రామంలో ఎందుకు అమలు కావడం లేదన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న.

**చట్టం స్పష్టం.. అపోహలే అడ్డంకి!**

భారత రాజ్యాంగం 73వ సవరణ ప్రకారం, స్థానిక సంస్థల్లో ఎస్టీలకు వారి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి. ముఖ్య గమనిక.. చట్టంలో ఎక్కడా "మెజారిటీ జనాభా ఉంటేనే రిజర్వేషన్ ఇవ్వాలి" అన్న నిబంధన లేదు. కేవలం నామమాత్రపు జనాభా ఉన్నా, రొటేషన్ పద్ధతిలో ఆ వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాల్సిందే. కానీ, బాపులపాడులో మాత్రం "ఎస్టీలు తక్కువగా ఉన్నారు, కాబట్టి రిజర్వేషన్ రాదు" అనే అసత్య ప్రచారం బలంగా వినిపిస్తోంది. ఈ అపోహల కారణంగానే అర్హత కలిగిన నాయకులున్నా, అవకాశాలు తలుపు తట్టడం లేదు.

**18 వార్డులు.. ఒక్క 'గిరిపుత్రుడి'కి చోటు లేదు**

మండల కేంద్రంగా ఎంతో కీలకమైన బాపులపాడు పంచాయతీలో మొత్తం 18 వార్డులు ఉన్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఇప్పటివరకు ఒక్క వార్డు కూడా ఎస్టీలకు కేటాయించకపోవడం, జనరల్‌గా వచ్చిన వార్డుల్లో కూడా ఎస్టీ వర్గానికి వార్డు సభ్యులుగా అవకాశం ఇవ్వబడిన దాఖలాలు లేవని స్థానికులు చెబుతున్నారు. ఓసీ, బీసీ, ఎస్సీ అన్ని వర్గాలకూ రొటేషన్ పద్ధతిలో సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలు దక్కాయి. కానీ ఎస్టీ వర్గానికి దశాబ్దాల కాలంలో ఒక్కసారి కూడా నాయకత్వ పీఠం దక్కలేదు. వార్డు స్థాయిలోనే ప్రాతినిధ్యం లేకపోతే, భవిష్యత్తులో ఆ వర్గం నుండి నాయకత్వం ఎలా ఉద్భవిస్తుంది? ఇది కేవలం సాంకేతిక లోపమా లేక ఉద్దేశపూర్వక నిర్లక్ష్యమా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**2026 ఎన్నికలే అసలైన పరీక్ష**

రానున్న 2026 స్థానిక సంస్థల ఎన్నికలు బాపులపాడు ఎస్టీ సామాజిక వర్గానికి చారిత్రక అవసరంగా మారాయి. గతంలో ఎన్నడూ అమలు కాని ఎస్టీ రిజర్వేషన్‌ను ఈసారి సర్పంచ్ లేదా ఎంపీటీసీ స్థానానికి కేటాయించాలి. ఇది కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదు, రాజకీయ పార్టీల చిత్తశుద్ధికి కూడా పరీక్ష.

**ఇది హక్కు.. భిక్ష కాదు!**

అభివృద్ధి ఫలాలు అందడం అంటే కేవలం సంక్షేమ పథకాలు పొందడం మాత్రమే కాదు; నిర్ణయాధికారంలో భాగస్వాములు కావడం. బాపులపాడులో ఎస్టీలు కోరుతోంది రాజ్యాంగం కల్పించిన తమ వాటాను మాత్రమే. 2026 నోటిఫికేషన్‌లోనైనా ఈ 'సామాజిక అన్యాయం' సరిదిద్దబడుతుందా? లేక మళ్ళీ అపోహల సుడిగుండంలో రాజ్యాంగ హక్కులు నలిగిపోతాయా? అన్నది వేచి చూడాలి.

## బీసీ సింహగర్జనను విజయవంతం చేయండి



పెదపారుపూడి మేజర్ న్యూస్ : ఈనెల 22వ తేదీన జరగనున్న బిసి సింహగర్జన సభను విజయవంతం చేయాల్సిందిగా భారత చైతన్య యువజన పార్టీ (బిసివై) పామర్రు నియోజకవర్గ యువజన కన్వీనర్ మసిముక్కు రాఘవేంద్ర (బాబి) పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రమైన పెదపారుపూడిలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయవాడ – గుంటూరు జాతీయ రహదారిలో నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా గల పూలే అంబేద్కర్ ప్రాంగణంలో బిసి సింహగర్జన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నా ఈ గర్జన సభను ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. బీసీల ఆత్మగౌరవం అధికారం కోసం జరిగే ఈ బీసీ సింహగర్జనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, అలాగే పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా బీసీ సింహగర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అంజిరేకుల వెంకటేష్, నాగనబోయిన నరేష్, జాజుల భరత్, అక్కిపల్లి ఫణి, గౌరిపర్తి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



## గోగినేని దశదిన కర్మలో పాల్గొన్నజంపాల

**ఇబ్రహీంపట్నం మేజర్ న్యూస్ :** మైలవరం నియోజకవర్గం ఇబ్రహీంపట్నం తెలుగుదేశం పార్టీ నాయకుడు అములో భవి హోటల్ అధినేత గోగినేని వెంకటేశ్వరరావు దశదిన కర్మ కార్యక్రమానికి హాజరైన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య ఆదివారం నాడు వారి స్వగృహంలో చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నూబోయన చిట్టిబాబు, లంక రామకృష్ణ, కుటుంబ సభ్యులు స్థానిక పార్టీ నేతలు పాల్గొన్నారు

# రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలి

**చల్లపల్లి మేజర్ న్యూస్ :** రక్తదానం పట్ల ప్రజల్లో అవగాహన మరింతగా పెంపొందించాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కృష్ణాజిల్లా చైర్మన్ డాక్టర్ డిఆర్ కె.ప్రసాద్ అన్నారు. చల్లపల్లి రాజా కళాశాల పూర్వవిద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో చల్లపల్లి రెడ్ క్రాస్ సబ్ బ్రాంచ్ సహకారంతో ఆదివారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో రక్తదాన శిబిరం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డిఆర్ కె ప్రసాద్ నిర్వాహకులను అభినందించారు. పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యం లో సేవా కార్యక్రమాలు నిర్వహించటంతోపాటు, రక్తదాన శిబిరాల ఏర్పాటుతో ఆపదలో ఉన్నవారికి తమ రక్తదానంతో ఉపయోగపడుతున్న పూర్వవిద్యార్థులు అభినందనీయులన్నారు. ప్రభుత్వ ఉ పాధ్యాయులు, పూర్వవిద్యార్థులు రక్తదానం చేశారు. విశ్రాంత ప్రిన్సిపాల్ టి.సాంబశివరావు, అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జి. అశ్విని కుమార్, బిడిఆర్ ప్రసాద్: డిఆర్వో సిసి తూము వెం కటేశ్వరరావు, రెడ్ క్రాస్ సబ్రా బ్రాంచ్ చైర్మన్ నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, యుటిఎఫ్ నేత



నారంశెట్టి వెం కటేశ్వరరావు, పూర్వవిద్యార్థుల సంఘం ప్రతినిధులు ఉప్పల నాంచారయ్య, కేతన సత్యనారాయణ, వాసిరెడ్డి రాకేష్, బళ్లా మధు, ఆకుల సుధీర్, ఎండి. ఎకె.జిలానీ, మోర్ల శివ, యడ్ల జగదీష్, జన్ను నాం చారయ్య కస్తూరి విజయ్, తమ్మిశెట్టి నాగేశ్వరరావు, బొల్లా ఫణి, పోతురాజు, బ్లడ్బ్యాంక్ ప్రతినిధులు డాక్టర్ హనుమంతయ్య, హరికృష్ణ లు పాల్గొన్నారు.



## జిల్లాస్థాయి ఆటల పోటీల్లో ఇబ్రహీంపట్నం భవిత విద్యార్థులు

**ఇబ్రహీంపట్నం మేజర్ న్యూస్ :** ప్రత్యేక అవసరతల పిల్లల, జిల్లాస్థాయి, ఆటలు పోటీల్లో, ఇబ్రహీంపట్నం భవిత విద్యార్థినీ విద్యార్థులు, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థినీ విద్యార్థులకు, గత రెండు రోజుల నుంచి ఆర్ట్ అండ్ కల్చరల్ ప్రోగ్రామ్స్ స్టెల్లా కాలేజ్ లో నిర్వహించడం జరిగినది, అందులో భాగంగా, ఇబ్రహీంపట్నం మండలం భవితసెంటర్ కు సంబంధించిన విద్యార్థులకు, డీఈవో ఎల్ చంద్రకళ మేడం, డిస్టిక్ అయి కోఆర్డినేటర్ కె నారాయణ, భారతి విజేతలకు బహుమతులను అందజేశారు, డిఇఓ మేడం మాట్లాడుతూ, ప్రతి ఒక్క తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అంతేకాకుండా చిన్నారులు చక్కగా పోటీలలో పాల్గొని మేము ఏ విషయంలోనూ తక్కువ కాదు, అని నిరూపించుకున్నారు, అన్ని అన్ని రంగాలలో కూడా వాళ్ళ వారి యొక్క ప్రతిభను చాటుతున్నారు చాలా గర్వంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమం నిర్వహించిన ఎన్టీఆర్ జిల్లా సమగ్ర శిక్ష అధికారులకు విద్యార్థులు తల్లిదండ్రులు, ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఇందులో ప్రత్యేక ఉపాధ్యాయులు, సాధిక్, చంద్రావతి, ఉష, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం మండల విద్యాశాఖ అధికాణిలు, సిహెచ్ పుష్పలత, పివీ మాలిని,పిల్లలకు అభినందనలు తెలియజేశారు.

## మనకోసం కాదు.. సమాజం కోసం బ్రతకాలి



**హనుమాన్ జంక్షన్, ఫిబ్రవరి 8, మేజర్ న్యూస్ :** మన జన్మకు సార్ధకత చేకూరాలంటే వయసు వచ్చిన తరువాత మనకోసం మాత్రమే కాకుండా సమాజం కోసం బ్రతకాలని ఉమ్మడి కృష్ణాజిల్లా సెంట్రల్ కమిటీ చైర్మన్, మానవత స్వచ్ఛంద సేవాసంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం హనుమాన్ జంక్షన్‌లోని మానవతా కార్యాలయంలో ఉమ్మడి కృష్ణాజిల్లా మానవతా కార్యవర్గ సమావేశం కొండ్రెడ్డి వెంకట సత్య నారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మారుబోయిన కోటేశ్వరరావు మాట్లాడుతూ, సంస్థ ఆధ్వర్యంలో రూ.50 లక్షలతో ఏర్పాటు చేయనున్న విద్యానిధి గురించి విధి విధానాలను వివరించారు. సభ్యుల సూచనలు స్వీకరించి నిబంధనలను రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ పొట్లూరు వీర శేషగిరిరావు, సోదా బత్తుల నాగేశ్వరరావు, రక్తనిధి కమిటీ చైర్మన్ కృష్ణ ప్రసాద్, జిల్లా కార్యదర్శి జెన్యావుల వీర వెంకట సత్యనారాయణ, ట్రెజరర్ అన్నపురెడ్డి గోపి రెడ్డి పాల్గొన్నారు. అలాగే అన్ని మండలాల ప్రధానులు, సమన్వయ కమిటీ డైరెక్టర్లు, పర్యావరణ కమిటీ డైరె క్టర్లు, కెరీర్ గైడెన్స్ కమిటీ డైరెక్టర్లు, రక్తనిధి కమిటీ డైరెక్టర్లు చర్చల్లో పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే రాజా



పామర్రు మేజర్ న్యూస్ : పామర్రు ఇటీవల దివంగతులైన వారి కుటుంబాలను స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆదివారం పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చాగంటిపాటి అనిల్ కుమార్ పెద్దకర్మ కార్యక్రమం ఆదివారం జరుగగా ఆ కార్యక్రమంలో కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే పామర్రుటౌన్ లో గుంప దుర్గా ప్రసాద్ ఇటీవల మృతి చెందగా ఆయన పెద్దకర్మ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో కూడా కుమార్ రాజా పాల్గొని దుర్గాప్రసాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే మండల పరిధిలోని కొండిపర్రు గ్రామంలో ఆదివారం జరిగిన ఆరేపల్లి వెంకటేశ్వరరావు ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమాలలో తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రామాలయ నిర్మాణానికి లక్ష రూపాయల విరాళం

**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** సనాతన ధర్మంతో సన్మార్గం వైపు నడవబడతామని వ్యాపారవేత్త కూచిపూడి కృష్ణారావు అన్నారు. మండలంలోని తాడంకి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయ నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ నిర్మాణానికి లక్ష రూపాయల నగదు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. గ్రామస్తుల సహకారంతో రైతులందరూ సమిష్టిగా ఆలయ నిర్మాణం చేపట్టుకోవడం అభినందనీయమని, తన స్వగ్రామంలో జరుగుతున్న రామాలయ నిర్మాణంలో తాను భాగస్వామ్యం అవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మారగాని సుబ్బారావు, పులి గంగాధరరావు, జంపాన రఘుబాబు, చలపాటి రమేష్, మారగాని ప్రసాద్, కట్ట అర్జిబాబు, పామర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాత కృష్ణారావును ఆలయ కమిటీ ప్రతినిధులు సత్కరించారు.

## అంధత్వాన్ని జయించిన నాగరాజుకు ఎంపీ, ఎమ్మెల్యే సన్మానం



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** అంధత్వాన్ని ఆత్మవిశ్వాసంతో జయించి గ్రూప్-2 ఉద్యోగం సాధించిన నందం నాగరాజును మచిలీపట్టణం ఎంపీ వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అభినందించారు. ఆదివారం చల్లపల్లిలోని జనసేన పార్టీ కార్యాలయంలో నాగరాజుకు మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు పద్మశాలిపేటకు చెందిన నాగరాజు తొమ్మిదో తరగతిలో రోడ్డు ప్రమాదానికి గురై రెండు కళ్ళు పోగొట్టుకున్నాడు. చిన్న వయసులోనే తండ్రిని కూడా కరెంట్ షాక్ రూపంలో పోగొట్టుకున్న నాగరాజు తల్లి ప్రోత్సాహంతో చదువుకుని తాజా గ్రూప్-2 ద్వారా జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, చల్లపల్లి, లక్ష్మీపురం సర్పంచులు పైడిపాముల కృష్ణకుమారి, కొల్లూరి కోటేశ్వరరావు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు చోడగం విమల్ కృష్ణ, ప్రధాన కార్యదర్శి తోట మురళీకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ బొందలపాటి వీరబాబు, ఏఎంసీ డైరెక్టర్ సూదాని నందగోపాల్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ దశరథ జనార్ధన్



**వత్సవాయి, ఫిబ్రవరి 08, మేజర్ న్యూస్ :** మండలం మంగొల్లు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న వేషాల కాశయ్య, మన్నే రాంబాబు పరిస్థితిని తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ రాజకీయ కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్, జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ స్వయంగా వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, అవసరమైన సహాయాన్ని అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వడ్లమూడి రాంబాబు, కట్టా వెంకట నరసింహారావు, మన్నే నారాయణ, బొల్లం పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మం సేవలు అభినందనీయం





మొవ్వ మేజర్ న్యూస్: మండల కేంద్రమైన మొవ్వ వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖవసతి గృహంలో 4వ తరగతి ఉద్యోగిగా పనిచేసి అధికారులు, విద్యార్థుల మన్ననలను పొందిన వెణుతురుమిల్లి. సీతారామ బ్రహ్మం సేవలు అభినందనీయమని కృష్ణా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖాధికారి జి.రమేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన మొవ్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహంలో నాలుగవ తరగతి ఉద్యోగ పనిచేసి గత నెల 31వ తేదీన ఉద్యోగ విరమణ చేసిన వెణు తురుమిల్లి. సీతారామ బ్రహ్మం దంపతులను ఆ శాఖ ఉద్యోగులు, బంధువులు, శ్రేయోభిలాషులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డిబిసిడబ్ల్యుఓ రమేష్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి సేవా దృక్పథంతో పనిచేసి ప్రజలు మన్ననలను పొందాలని సూచించారు. బీసీ సంక్షేమ శాఖలో 40 సంవత్సరాలు పైగా పనిచేసి తన సర్వీసులో ఎలాంటి రిమార్కు లేకుండా ఉద్యోగ విరమణ చేయటం ఎంతో గర్వించదగ్గ విషయం అన్నారు. ప్రతి ఉద్యోగి బ్రహ్మన్ని ఆదర్శంగా తీసుకుని తన వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసి గుర్తింపు పొందాలని డిబి సిడబ్ల్యుఓ రమేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీతారామ బ్రహ్మం దంపతులను బంధువులు, ఆ శాఖ ఉద్యోగులు, శ్రేయోభిలాషులు ఘనంగా సత్కరించారు. విశ్రాంత డిబి సిడబ్ల్యుఓ లాలారజిపతిరావు, మచిలీపట్నం ఏబిసిడబ్ల్యుఓ ఎస్.హనుమ,చిట్టూరి. నాగేశ్వరరావు పలువురు అధికారులు, బంధువులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌పై భాజపా పామర్రు మండల నేతల స్పందన



పామర్రు మేజర్ న్యూస్ : కేంద్ర బడ్జెట్‌పై భారతీయ జనతా పార్టీ పామర్రు మండల అధ్యక్షులు ముదునూరు శివకృష్ణ అధ్యక్షతన పామర్రు లో ఆదివారం సమావేశం నిర్వహించారు. సందర్భంగా శివకృష్ణ మాట్లాడుతూ ఫిబ్రవరి 1వ తేదీన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టడం చారిత్రాత్మకం అని పేర్కొన్నారు. ఈసారి బడ్జెట్ "వికసిత భారత్" లక్ష్యంతో రూపొందించబడిందని, దేశ ఆర్థిక వృద్ధి, సంక్షేమంఅభివృద్ధి, టెక్నాలజీఇన్నోవేషన్ రంగాలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఫిస్కల్ డెఫిసిట్‌ను 4.4శాతానికి తగ్గించడం, పన్నుల పంపిణీలో రాష్ట్రాలకు 41శాతం వాటా కొనసాగించడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు 64వేల కోట్ల రూపాయల లబ్ధి అందనున్నట్లు తెలిపారు. అమరావతి, పోలవరం అభివృద్ధి, గ్రామీణ మౌలిక వసతులు, టెక్స్టైల్, మత్స్యరంగం, కొబ్బరికోకో సాగుకు మద్దతు వంటి అంశాలు రాష్ట్రానికి అనుకూలంగా ఉన్నాయన్నారు. హైస్పీడ్ రైల్, ఖనిజ వనరులు, డేటా సెంటర్ల అభివృద్ధి ఆంధ్రప్రదేశ్‌కు కొత్త అవకాశాలను తెరుస్తాయనే ఆశాభవాన్ని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బడే కేశవరావు, రాజేంద్రప్రసాద్, వీరాంజనేయులు, మొవ్వ జయకిరణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## నేడు బొమ్ములూరులో ఉచిత దంత వైద్య శిబిరం



**హనుమాన్ జంక్షన్, ఫిబ్రవరి 8, మేజర్ న్యూస్ :** పిన్నమనేని సిద్దార్థ మెడికల్ కాలేజీ సౌజన్యంతో సోమవారం ఉదయం బాపులపాడు మండలం బొమ్ములూరు గ్రామంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ కాటూరు విజయ్ భాస్కర్ తెలిపారు. ఈ శిబిరంలో దంతాలు శుభ్రపరచడం, దంత సమస్యలను పరీక్షించడం, అవసరమైన మందులు అందించడం తదితర వైద్య సేవలు పూర్తిగా ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని దంత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సర్పంచ్ విజయ్ భాస్కర్ కోరారు.

## భౌతిక కాయాన్ని సందర్శించిన తన్నీరు



వత్సవాయి మేజర్ న్యూస్ : వత్సవాయి మండలం దేచుపాలెం గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకులు అన్నెపాక తిరుపతిరావు మరణించిన విషయాన్ని తెలుసుకొని ఈరోజు వారి నివాసానికి వెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించిన జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు వారితో పాటు వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్ (చిన్నా) గ్రామ సర్పంచ్ బొల్లం నారాయణ ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షులు పతకముడి చిన్నబ్బాయి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి దర్శనాల వెంకటరమణ, సీనియర్ నాయకులు ఉప్పెల్లి పెంటయ్య, మండల కార్యదర్శి పతకముడి నాగేశ్వరరావు, జగ్గయ్యపేట మండల రైతు బీసీ, విభాగల అధ్యక్షులు గుడిపాటి శేషగిరిరావు, గుడి కందుల సత్యనారాయణ, జగ్గయ్యపేట మండల ఉపాధ్యక్షులు గడ్డం రామకృష్ణ, తదితరులు నివాళులర్పించారు.

## వీరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే



పామర్రు మేజర్ న్యూస్: ఉయ్యూరులో జరుగుతున్న వీరమ్మ తల్లి సంబరాలు సందర్భంగా పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆదివారం గుడికి వెళ్లి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేకంగా పారుపూడి కనక చింతయ్య - వీరమ్మ తల్లి అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా తోపాటు జిల్లా తెలుగు యువత అధ్యక్షులు దండమూడి చౌదరి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సూర్యతేజకు ఘన సన్మానం



మొవ్వ మేజర్ న్యూస్: మండల పరిధిలోనికాజ గ్రామంలోనిరుపేద పద్మశాలి కుటుంబంలో జన్మించి గ్రూప్-1లో మెరిసి డి.ఎస్.పి.గా విజయం సాధించిన కోదాటి. నాగభూషణం,రాజ్యలక్ష్మి దంపతుల కుమారుడు కోదాటి. సూర్యతేజ ను ఆదివారం సాయంత్రం పలువురు పద్మశాలి సంఘం నాయకులు వారి స్వగృహంలోతల్లిదండ్రులతో కలిపి ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సత్కారాన్నిఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షులుజీ.వి.నాగేశ్వరరావు,రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం ప్రధానకార్యదర్శిఅందె. జగదీష్, కృష్ణాజిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షులు కొండవీటి అమర బాలేశ్వరరావు, కూచిపూడి గ్రామ పద్మశాలి సంఘ అధ్యక్షులు కాటూరి. శ్రీకాంత్, తుమ్మా.ఈశ్వరరావు, పామర్రు నియోజకవర్గ సిపిఐ సమితికార్యదర్శిచెరుకు శ్రీనివాస్, కోదాటి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా హాజరైనఅతిథులు మాట్లాడుతూ సూర్యతేజ కు ఆశీస్సులు తెలుపుతూ ఉద్యోగం నిర్వహణ లో అందరినీ కలుపుకొని విధులు నిర్వహించి గ్రామానికి మంచి పేరు తీసుకువచ్చి ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు.

# భారీ ఊరేగింపుతో వీరమ్మ తల్లి మొక్కుబడుల చెల్లింపు...





తోట్లవల్లూరు మేజర్ న్యూస్ : మండల పరిధిలోని కుమ్మమూరు గ్రామంలో కృష్ణాజిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షులు రామినేని కుటుంబరావు ఆధ్వర్యంలో ఆదివారం ఉయ్యూరు వీరమ్మ తల్లికి భారీ ఊరేగింపుతో మొక్కుబడులు చెల్లించారు. ఇందులో భాగంగా భారీ ఎత్తున యువత కేరింతలు, బేతాళ వేషాలు, డిజె సౌండ్ సిస్టం, వందమంది డప్పు కళాకారుల ఆధ్వర్యంలో విన్యాసాలతో ఊరేగింపుగా బయలుదేరారు. పూజా కార్యక్రమాలు నిర్వహించి పొట్టేళ్లతో కట్టిన అమ్మవారి రథంతో ఊరేగింపుగా బయలుదేరారు. ఈ కార్యక్రమంలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి, మాజీ ఎమ్మెల్సీ యలమంచిలి బాబు రాజేంద్రప్రసాద్, తోట్లవల్లూరు మండల పార్టీ అధ్యక్షులు వీరపనేని శివరామ్, కృష్ణాజిల్లా తెలుగు యువత అధ్యక్షులు దండమూడి చౌదరి తదితరులతోపాటు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిన్మయ మిషన్ 76వ వార్షికోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బొండా





విజయవాడ మేజర్ న్యూస్ : ఆదివారం ఉదయం 9:30 గంటలకు, విజయవాడ భవానీపురం బబ్బూరి గ్రౌండ్స్ నందు ఘనంగా నిర్వహించిన చిన్మయ మిషన్ 76వ వార్షికోత్సవం (అమృత మహోత్సవం) కార్యక్రమంలో భాగంగా జరిగిన మనుమాన్ చాలీసా 108 పారాయణం లో ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొండా ఉమ మాట్లాడుతూ సాంకేతికంగా, భౌతికంగా అభివృద్ధి ఎంత వేగంగా జరిగినా, విలువలతో కూడిన అభివృద్ధే నిజమైన ప్రగతి అని, భగవద్గీత బోధించే స్వార్థరహిత కర్మ, నైతిక నాయకత్వం తమ ప్రభుత్వ పాలనకు మార్గదర్శక సూత్రాలుగా కొనసాగుతున్నాయని తెలిపారు.సమాజానికి 76 ఏళ్ల సేవ స్ఫూర్తిదాయకం గత 76 సంవత్సరాలుగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువలను ప్రజల్లో పెంపొందిస్తూ, సమాజ హితానికి చిన్మయ మిషన్ అందిస్తున్న సేవలు నిజంగా స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. ఇటువంటి కార్యక్రమాలు యువతలో సానుకూల దృక్పథాన్ని, మానవీయ విలువలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్మయ మిషన్ ప్రతినిధులు, ఆధ్యాత్మిక గురువులు, భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



## నేడు విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికిభూమి పూజ.

మొవ్వ మేజర్ న్యూస్: మండల పరిధిలోని కూచిపూడి గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి సోమవారం స్థానిక శాసనసభ్యులు వర్ల. కుమార్ రాజా చేతులు మీదుగా శంకుస్థాపన నిర్వహించునున్నట్లు మొవ్వ విద్యుత్ శాఖఏ.ఇ కే.ఎన్.వి రమేష్ తెలిపారు. నాలుగు కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు అయ్యే 33 కె.వి సబ్ స్టేషన్ పెదపూడి పంచాయతీ పరిధిలో కొంతమంది దాతలు సహకారంతో కూచిపూడి గ్రామ సర్పంచ్ కొండవీటి.వెంకటరమణ విజయలక్ష్మి,అమరబాలేశ్వరరావు దంపతులు స్వంత నిధులు2.50 లక్షలు కలిపి 8.50 లక్షలతో కొనుగోలు చేసి విద్యుత్ శాఖ వారికి దానపత్రం ద్వారా దఖలు పరిచిన స్థలంలో భూమి పూజ కార్యక్రమశీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్.ఇ. వి.వి.చిరంజీవి, డి.ఇ. ఇ. గోవిందరావు, ఏడిఇ కే. సుందరరావు తదితరులు పాల్గొన్నట్లుఎ.ఇ రమేష్ తెలిపారు.

## బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ తొండపు



జగ్గయ్యపేట, ఫిబ్రవరి 08, మేజర్ న్యూస్ : ఇటీవల కాలంలో మరణించిన మండల దేచుపాలెం గ్రామానికి చెందిన కనపర్తి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను, అలాగే పెనుగంచిప్రోలు మండలం లింగగూడెం గ్రామానికి చెందిన మాదినేని బసవయ్య కుటుంబ సభ్యులను తెలుగుదేశం పార్టీ రాజకీయ కార్యదర్శి, పోలిట్ బ్యూరో సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్, జయప్రద ఫౌండేషన్ ఛైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ కష్టకాలంలో పార్టీ, తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పి, దేవుడు వారికి మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం వత్సవాయి మండల పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, జగ్గయ్యపేట మండల పార్టీ అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు, పెనుగంచిప్రోలు మండల పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, సీనియర్ నాయకులు వేగినేటి గోపాలకృష్ణ మూర్తి, మన్నే నారాయణ, బొల్లం పురుషోత్తం,గింజపల్లి గోపీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన 'ఆంధ్రనాట్య సంగమం' నవ జనార్ధన పారిజాత నృత్య ప్రదర్శన

విజయవాడ మేజర్ న్యూస్ : నగరంలోని గవర్నర్‌పేటలో మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో 'స్వరనర్తన' సంగీత నృత్య శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఆంధ్రనాట్య సంగమం" కార్యక్రమం ఆదివారం రాత్రి కళాప్రియుల మధ్య అత్యంత వైభవంగా ముగిసింది. కీ.శే. పద్మశ్రీ డా. నటరాజ రామకృష్ణ ఆశీస్సులతో, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత గురు డా. కళాకృష్ణ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమం ఆంధ్ర నాట్య వైభవాన్ని చాటింది. ఈ సందర్భంగా పద్మామోహన్ దెందులూరి ప్రత్యేక "నవ జనార్ధన పారిజాత" నృత్య ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనకు గురు డా. కళాకృష్ణ నట్టువాంగం మరియు నృత్య దర్శకత్వం వహించారు. గత సంవత్సరం డిసెంబర్ 13, 2025న నిర్వహించిన ఆంధ్రనాట్య సంగమం పోటీలలో విజేతలైన విద్యార్థులు తమ నృత్య ప్రతిభతో సభను మంత్రముగ్ధులను చేశారు. కార్యక్రమానికి సభాధ్యక్షులుగా ఆంధ్రప్రదేశ్ పూర్వ ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి డా. దెందులూరి నళినీ మోహన్ హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా శాసన సభ సభ్యులు మండలి బుద్ధప్రసాద్, ఏపీ సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ ఛైర్పర్సన్ తేజస్వి పొడపాటి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య డి. మునిరత్నం నాయుడు, విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి ఏ.వి. శేషసాయి పాల్గొన్నారు. ఆత్మీయ అతిథులుగా పద్మశ్రీ ఉమామ హేశ్వరి గురు డా. కళాకృష్ణ కార్యక్రమానికి ప్రత్యేక శోభను చేకూర్చారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన కళాకారులు, గురువులు, అతిథులు, ప్రేక్షకులందరికీ 'స్వరనర్తన' వ్యవస్థాపకులు శ్రీమతి పద్మామోహన్ దెందు లూరి, నవత కార్యనిర్వాహక బృందం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

**ఆంధ్రనాట్య పరిరక్షణకు విజ్ఞప్తి ..** ఆంధ్రనాట్యాన్ని రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ సంగీతనృత్య కళాశాలలలో ప్రత్యేక కోర్సుగా ప్రవేశపెట్టాలని కళాభిమానులు ఆకాంక్షించారు. ఈ శాస్త్రీయ నృత్యరూపం ద్వారా ఆంధ్రుల సాంస్కృతిక వైభవం తరతరాలకు అందించబడుతుందన్నారు. అదేవిధంగా, ఆంధ్రనాట్య పునరుజ్జీవనానికి ఎనలేని సేవలు అందించిన పద్మశ్రీ డా. నటరాజ రామకృష్ణ పేరుతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక ప్రతిష్టాత్మక రాష్ట్రస్థాయి పురస్కారాన్ని ఏర్పాటు చేయాలని సాంస్కృతిక వర్గాలు కోరాయి. ఇది ఆంధ్రనాట్య కళాకారులకు ప్రోత్సాహంగా నిలవడమే కాక, ఈ అపూర్వ నృత్య సంప్రదాయానికి గౌరవాన్ని చేకూర్చే మహత్తర నిర్ణయంగా నిలుస్తుందన్నారు.

# యువతకు ఉద్యోగాల కల్పన కోసం పరిశ్రమ ఏర్పాటుకు కృషి



### మ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

### వక్కలగడ్డలో కమ్యూనిటీ హాలు ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే

**చల్లపల్లి మేజర్ న్యూస్ :** వైసీపీ నేతలు అవినీతికి పాల్పడేందుకు తిరుపతి లడ్డూ ప్రసాదమే దొరికిందా? అని మచిలీపట్టణం ఎంపీ వల్లభనేని బాలశౌరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం చల్లపల్లి మండలం వక్కలగడ్డ దొరవానిగూడెంలో ఎంపీ బాలశౌరి మంజూరు చేసిన ఎన్.టీ.పీ.సీ సీఎస్ఆర్ నిధులు రూ.25లక్షలతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాలును ఎంపీ బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ ఇప్పటికి రూ.50కోట్ల సీఎస్ఆర్ నిధులు తెచ్చి కమ్యూనిటీ భవనాలు, వంతెనలు నిర్మించామని, మరో రూ.50కోట్ల సీఎస్ఆర్ నిధులు తెచ్చి మరిన్ని పనులు చేస్తామన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కేంద్రం నుంచి తెచ్చిన సాస్కి నిధులతో రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. డొంక రోడ్ల అభివృద్ధిపై కూడా డిప్యూటీ సీఎం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధికి బందరు పోర్ట్ నిర్మిస్తున్నామని, మచిలీపట్టణం- రేపల్లె రైల్వే లైన్ కూడా త్వరలో సాకారం కానుందని తెలిపారు. పోర్టుకు అనుసంధానంగా రూ.574 కోట్లతో ఆరు లైన్ల రోడ్ నిర్మిస్తామన్నారు. లడ్డు ప్రసాదం అంశంపై బాలశౌరి మాట్లాడుతూ పవిత్రమైన లడ్డును రసాయన భరిత ప్రమాదకర కల్తీ నెయ్యితో తయారు చేసి తిరుపతి ప్రసాదాన్ని అపవిత్రం చేయటమే కాకుండా తప్పును కప్పిపుచ్చుకోవడం కోసం వైసీపీ నాయకులు ఇంకా బుకాయించటం సిగ్గుచేటు అన్నారు. కెమికల్స్ అమ్మిన వారు వైసీపీ నేతల ఖాతాలకు డబ్బు ఎందుకు పంపారని ప్రశ్నించారు. కల్తీ నెయ్యి వినియోగం జరిగిందని తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, వైసీపీ బుకాయింపునకు అనుగుణంగా కల్తీ జరగలేదని ఒక్క ఆధారం అయినా ఉందా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం మానుకోవాలని సూచించారు. జనసేన కార్యకర్తలు వైసిపి మోసాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ వక్కలగడ్డ గ్రామంలో కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పల్లె పండుగ కార్యక్రమం ద్వారా ఇచ్చిన రూ.33లక్షలతో నాలుగు సీసీ రోడ్లు నిర్మించామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలోనూ అనేక సీసీ రోడ్లు నిర్మించామన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ – గ్రామీణ అభివృద్ధి శాఖ తీసుకోవడం, గ్రామీణ ప్రాంత అభివృద్ధికి వరంగా నిలుస్తోందన్నారు. మరిన్ని రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ ప్రాంత యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనకు పరిశ్రమ స్థాపనకు కృషి చేస్తున్నామన్నారు. బందర్ పోర్టు నిర్మాణం, రైల్వే లైను ఏర్పాటుతో ఈ ప్రాంతం అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఎంపీ బాలశౌరి తెస్తున్న సీఎస్ఆర్ నిధులతో లాభాపేక్ష లేకుండా చక్కని భవనాలు నిర్మిస్తున్న రోటరీ కమ్యూనిటీ సర్వీస్ ట్రస్ట్ ప్రతినిధులను అభినందించారు. నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ మాట్లాడుతూ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోటరీ కమ్యూనిటీ సర్వీస్ ట్రస్ట్ నిర్వాహకులు జీ.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

**వత్సవాయి మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ సెంటర్‌లో ఆటో ఆటో స్టాండ్‌లో సమ్మె కరపత్రాలు ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి బి రాము మాట్లాడుతూ కార్మిక వర్గానికి నష్టం చేసే లేబర్ కోడ్స్ రద్దు చేయాలి. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు. అధిక పెనాల్టీ వేసే జీవో నెంబర్ 21న రద్దు చేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చేందుకు 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కొత్తగా 4 లేబర్ కోడ్స్ తెచ్చింది. దేశంలో కోట్ల మంది ఉపాధి పొందుతున్న ట్రాన్స్పోర్టు రంగంలో ఎంవి యాక్ట్ సవరణ చట్టం ద్వారా ఓలా. ఊబర్ వంటి ప్రైవేటు, విదేశి కంపెనీ సర్వీస్లకు దేశంలో అవకాశం కల్పించారు. సహజ వనరులైన ఆయిల్, గ్యాస్ నిక్షేపాలను అంబాని, అదాని వంటి కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు. ప్రైవేటు కంపెనీలు లాభాలే పరమావధిగా విపరీతంగా ఆయిల్ ధరలు పెంచుతున్నారు. ఫలితంగా ఆటో, ట్రాలీ ఆటో, టాటా ఏస్, గూడ్స్ ఆటోల మెయిన్టిటినెన్స్, స్పేర్పార్ట్స్ ధరలు, ఇన్సూరెన్స్ రేట్లు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఆటోలకు కిరాయిలు లేక ఫైనాన్స్ కిస్తీలు కట్టలేక వాహనాలు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పరిస్థితి రోజురోజుకూ దిగజారుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని అంతేకాక ఆర్టిఓ అధికారులు, ట్రాఫిక్ పోలీసుల వేధింపులు పెరిగాయి. జీఓ 21 తెచ్చి ఇచలానాల పేరుతో వేల రూపా



యలు జరిమానాలు విధిస్తున్నారు. అన్ని రకాల ఆర్టిఓ టాక్స్, లైసెన్స్, గ్రీన్ టాక్స్, రోడ్ టాక్స్ పెంచుకుంటూపోతున్నారు. మహిళలకు ఫ్రీ బస్ పథ కం పెట్టిన తర్వాత ఆటో కార్మికుల కిరాయిలు తగ్గి పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల పాలవుతున్నారు. వృత్తి నుండి దూరమవు తున్నారు. వీరిని ఆదుకునేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆటో డ్రైవర్లకు సంక్షేమబోర్డు ఏర్పాటుచేయాలి. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్, యం.వి. యాక్టు సవరణ చట్టం రద్దు చేయాలి. భారీ పెనాల్టీలు విధించే జీఓ నెం. 21 రద్దు చేయాలి. ఆటో ఉపాధిని దెబ్బతీసే ఓలా. ఓబర్ వంటి విదేశీ, ప్రైవేటీ కంపెనీలకు అనుమతి రద్దుచెయ్యాలి. కేరళ రాష్ట్రంలో వలె ప్రభుత్వ మే ఉచిత యాప్ పెట్టాలి. ఆటోల కొనుగోలుకు బ్యాంక్ ద్వారా తక్కువ వడ్డీతో రుణాలు మంజూరు చెయ్యాలి. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు జె.శ్రీను, శ్రీను, నరసింహరావు,గోపి, గోవింద్, రమేష్, శ్రీనుమధు, ఇమామ్ పాల్గొన్నారు

# కొవ్వెక్కిన మాటలు మానుకో...

### టీడీపీ నేత కనపర్తి వైఎస్సార్సీపీ నేతలు హెచ్చరిక

### తీరు మారకుంటే తగిన విధంగా బుద్ధి చెబుతామని హెచ్చరిక

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** కొవ్వెక్కిన మాటలు మానుకుని ముందు మండలానికి రెండు గ్రూపులైన మీ టీడీపీని చక్కదిద్దుకుని సుద్దులు చెప్పాలని టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావుకు వైఎస్సార్సీపీ పంచాయితీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు సింహాద్రి వెంకటేశ్వరరావు హితవు పలికారు. స్థానిక వైఎస్సార్సీపీ కార్యాలయంలో ఆదివారం విలేఖరులతో మాట్లాడుతూ గత రెండు రోజుల నుంచి జనసేన, టీడీపీ నేతలు చేస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. సుప్రీంకోర్టు నియమించిన సిట్ నివేదికలో జంతువు కొవ్వు కలవలేదని చెబుతుంటే మీ సొంత భాష్యం చెబుతూ వెంకటేశ్వరస్వామిని అభాసుపాలు చేయొద్దని హితవు పలికారు. అంబటి రాంబాబును 70 సంవత్సరాల వృద్ధురాలు బండబూతులు తిడుతుంటే అక్కడే ఉన్న మీతో పాటు మీ నాయకులు ఎందుకు వారించలేదన్నారు. ఒక మహిళ ఇష్టం వచ్చినట్టు బూతులు తిడుతుంటే తట్టుకోలేక ఎదురు మాట్లాడారని అందుకు ఆయన తరువాత క్షమాపణ కూడా చెప్పినా ఇంటికి కార్యాలయానికి నిప్పుపెట్టించి నీచ సంస్కృతికి తెరతీశారని చెప్పారు. బెల్టుషాపుల గురించి నువ్వు చెప్పినాఇక్కడ ఎవరూ పట్టించుకోలేదని, మీ పార్టీ గ్రామ కన్వీనర్ కలెక్టర్కు ఫిర్యాదు చేస్తే బెల్టుషాపులు తొలగించారని అదీ నీ స్థాయి అన్నారు. నువ్వు నియోజకవర్గానికి వచ్చిన తరువాత మీ పార్టీ మండలానికి రెండు మూడు గ్రూపులయ్యాయని



అదీ నీ పనితీరని కనపర్తికి వెంకటేశ్వర రావు చురకలంటించారు. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు మా పార్టీ అధినేత జగన్మోహన్రెడ్డి, మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబుపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తిరుపతి లడ్డూ విషయంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇప్పటికి మూడు సార్లు మాటలు మార్చారని, సిటి నివేదిక నేపథ్యంలో వారి మాటలను ప్రజలు బాగా అర్థం చేసుకున్నారని చెప్పారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మిమ్మల్ని తిడితే ఇప్పుడు బయటకు వచ్చి మీ ఇష్టం వచ్చినట్టు కారుకూతలు కూస్తున్నారని ఇవి మానుకోకుంటే తగిన విధంగా బుద్ధి చెప్పాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి గాజుల జయగోపాల్, వంకాయల రామకృష్ణ పాల్గొన్నారు.




## విద్యార్థుల ఉన్నతికి తల్లిదండ్రుల ప్రోత్సాహం అవసరం

### జిల్లా బీసీ సంక్షేమశాఖ డీడీ జి.రమేష్

**అవనిగడ్డ, మేజర్ న్యూస్:** విద్యార్థులవిద్యాన్నోతికితల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరం అని జిల్లా బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.రమేష్ అన్నారు. ఆదివారం స్థానిక బీసీ బాలికల కళాశాలవసతి గృహంలో పేరెంట్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి విచ్చేసిన రమేష్ మాట్లాడుతూ, సమాజంలో విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహిం చాలంటే గురువులతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం తప్పనిసరి అని వివరించారు. అనంతరం ప్రభుత్వనిధులతోవిద్యార్థులకు స్వచ్ఛ మైన త్రాగు నీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన మినీ మినరల్ వాటర్ ప్లాంట్ ను రమేష్ ప్రారంభించారు. వసతిగృహ సంక్షేమఅధికారిని నాగమణి మాట్లాడుతూ బీసీసంక్షేమశాఖ విద్యార్థుల సౌకర్యార్థంఅమలుచేస్తున్న పథకాలను విద్యార్థినులు సద్వినిగం చేసుకోవాలన్నారు. ఈ సందర్బంగా విద్యార్థుల తల్లిదండ్రులు వసతి గృహాల్లో వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. పోషక పదార్థాలతో కూడిన ఆహారం నిత్యం అందిస్తున్నారని విద్యార్థులు పేరెంట్స్ కు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అన్నా క్యాంటీన్‌ను మరింత అభివృద్ధి చేస్తా...

### అన్నా క్యాంటీన్ చైర్మన్ రాళ్ల కొట్టు రాము



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** అన్నా క్యాంటీన్ మరింతగా అభివృద్ధి చేస్తానని అన్నా క్యాంటీన్ చైర్మన్ రాళ్ల కొట్టు రాము అన్నారు. నిరుపేదల ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్ కు దాతల సహకారం ఎంతో అవసరమని రాళ్ల కొట్టు రాము అన్నారు. ఆదివారం రాళ్ల కొట్టు రాము మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా నిర్వహించే అన్న క్యాంటీన్ పేదల ఆకలి తీర్చే విధంగా పనిచేస్తుందని, అలాంటి అన్నా క్యాంటీన్ అభివృద్ధి చేయడం మనందరి బాధ్యత అన్నారు.అన్న క్యాంటీన్ కు దాతలు సహాయ సహకారాలు అందించి, నిరుపేదల ఆకలి తీర్చే విధంగా కృషి చేయాలన్నారు. ప్రముఖ వైద్యులు, డాక్టర్ బి. ధన్వంతరి ఆచార్య ఆగస్టు 15 న వారి జన్మదినం సందర్భంగా ప్రతి సంవత్సరం లక్ష రూపాయలు అన్నా క్యాంటీన్ కు డొనేషన్ చేస్తూ తన దాతృత్వాన్ని చాటుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు.ధన్వంతరి ఆచార్య లాగా ప్రతి ఒక్కరు తమకు ఉన్నదాంట్లో పుట్టినరోజు ఫంక్షన్లు, వివాహ వేడుకలకు అన్నా క్యాంటీన్ కు సహాయ సహకారాలను అందించే విధంగా కృషి చేయాలన్నారు. నగర ప్రముఖులు,టిడిపి నాయకులు, కూటమి నాయకులు, నేతల సహకారంతో నగరంలో మరో రెండు ప్రాంతాలలో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నానన్నారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్, ప్రముఖ వైద్యులు డాక్టర్ బి ధన్వంతరీ ఆచార్య, టిడిపి నాయకుడు, లంకే హరికృష్ణ పాల్గొన్నారు.

19 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999